# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## పింజల సుబ్బారావు

### (విజయచిత్ర – 1980, మార్చి సంచిక నుంచి )



తెరవెనుక

పింజల సుబ్బారావు

కొందర్ని 'విధి' తమాషాగా అల్లరి చేస్తుంది; తన ఇష్టం వచ్చినట్టు గిరగిరా తిప్పుతుంది; ఆడిస్తుంది; పాడిస్తుంది; ఆ చోద్యాలు చూసి ఆనందంగా నవ్వుకుంటుంది. 'నా పరీక్షల్లో నెగ్గితేనే, ఆ వ్యక్తిని ఒక దారికి చేరుస్తాను' అన్నంతగా వుంటాయి విధి చేసే చేష్టలు. లేకపోతే పింజల సుబ్బారావు లాంటి నేటి ప్రసిద్ధ చిత్ర నిర్మాత, తొలి రోజుల్లో అన్ని తిప్పలు పడడం ఏమిటి ? అన్ని అవస్థలు అనుభవించడం ఏమిటి ?

"నేను చదువుకున్నది ఏమీ లేదు; వ్యాపారంలో అనుభవం అంతకంటే లేదు. పెట్టుబడి పెట్టడానికి నా దగ్గర డబ్బూ లేదు. కాని నా జీవితమే నాకు ఎన్నో పాఠాలు నేర్పింది; అనుభవాలు రుచి చూపించింది. 'నా జీవితం' అనే పుస్తకంలో నేను చదవుకున్న పాఠాలతోనే, ఇవాళ నేను చిత్ర నిర్మాతగా నిలబడ్డాను. అందుకనే నా కృతజ్ఞతలన్నీ నిరంతరం నా జీవితానికే చెప్పుకుంటూ వుంటాను" అన్నారు సుబ్బారావు.

మచిలీపట్నంలో, అప్పటి చిన్న సుబ్బారావు చదువు మీద శ్రద్ధ చూపలేదు. అది తనకి అవసరం అన్న భావనా లేదు; దానిమీద అయిష్టమూ లేదు. తండ్రి గారు చేసే బట్టల వ్యాపారంలో చేదోడు వాదోడుగా వుంటూ, అందులోనే స్థిరపడాలన్న ఉద్దేశం మాత్రం ఉండేది.

సుబ్బారావులో చిన్నప్పట్నుంచీ లోలోపల వీలైనప్పుడల్లా తొంగి చూస్తూ వుండేది ఒక 'కళ', అది నటన. నటించాలని, నటుడిగా పేరు తెచ్చుకోవాలనీ ఆ అబ్బాయి ఆశిస్తూ వుండేవాడు. ఆ కోరిక ఫలించేసరికి, అతనికి ఇరవై నాలుగేళ్ళు వచ్చేశాయి. నాటక రంగం మీద అనుభవం సంపాయించాలన్న ఉద్దేశ్యంతో అతను నాటకాలు, సినిమాలు బాగా చూస్తూ వుండేవాడు.

మచిలీపట్నంలోని నాటక సమాజం 'వసంతవని' లో జేరి, వాణీబాల, గోవిందరావులతో కలిసి సుబ్బారావు – పల్లెపడుచు, కూలి పిల్ల, నాటకం మొదలైన నాటకాల్లో వేషాలు వేస్తూ వుండేవాడు.

1954 లో ఓ తమాషా జరిగింది. 'పల్లెపడుచు' నాటకంలో సుబ్బారావు – రంగయ్య అనే దుష్ట పాత్ర ధరించేవారు. ఒకసారి ప్రదర్శన ముగిసిన తర్వాత, ఒకాయన ఆయన్ని అభినందిస్తూ "చాలా బావుంది. సినిమాల్లో జేరిపోకూడదూ ?" అని ఓ సలహా పారేశాడు. ఆ సలహాకు అదిరిపోయిన సుబ్బారావు – ఆ ఉద్దేశం తనకు తట్టనందుకు తనని నిందించుకుని – ఆ రాత్రి నిద్రపోకుండా ఆలోచించుకుని, వీలైనంత త్వరలో మద్రాసుకు రైలెక్కేయడానికి తీర్మానించుకున్నాడు.

ఆలోగా మరి కొంతమంది కూడా సుబ్బారావును ప్రోత్సహించడంతో, '55లో మద్రాసు వచ్చాడాయన. కాని ఎవర్ని కలవాలి ? ఎలా కలవాలి ? ఈ ఆలోచనలతోనే రెండు రోజులు గడిచి పోయింది. చేతిలో వున్న డబ్బులు ఖర్చయిపోయేలోగా, ఏ నిర్మాతనో దర్శకుడినో చూసి, తన కోరిక వెల్లడించి, వీలైతే, వెంటనే ఓ పాత్ర ధరించెయ్యాలి !...

మూడో రోజున తెగించి, సుబ్బారావు స్టూడియో లోకి వెళదామని వస్తే, గేటు దగ్గర అడ్డం వచ్చారు. అతనికేదో భయం వేసింది. సినిమాల్లోకి రావాలనుకున్న వాడికి ఇలా అడ్డాలు తగుల్తుంటే, ఎలా రాగలుగుతాడు ? లాభం లేదని ఆ రాత్రికే, తిరిగి తన వూరు వెళ్ళిపోయాడు.

మరో సంవత్సరం అలా గడిచిన తర్వాత, లోపల రగుల్తున్న 'పిపాసాగ్ని' కి తట్టుకోలేక, మళ్ళీ వచ్చి నాలుగైదు రోజులుండి పారిపోయాడు.

ఎవరైనా వున్నవూళ్ళ నుంచి మద్రాసు పారిపోయొస్తూ వుంటారు. తను మాత్రం రెండుసార్లూ తన వూరికే పారిపోయొచ్చాడు. తనకేమిటో భయంగా వుంది. తనలాంటి వాళ్ళూ, తనని మించిన వాళ్ళూ అక్కడ కనిపిస్తున్నారు. ఎలా ప్రవేశించాలో మార్గం తెలియడం లేదు. ఎవర్నయినా అడుగుదాం అంటే, ఏమంటారో అని భయం! తన ఉద్దేశం చెప్పాలంటే భయం! ఊళ్ళో తిరగాలంటే భయం. ఈ భయాలతో తను సతమతమై పోతున్నాడు.

ఒక రాత్రి సుబ్బారావు దీర్ఘంగా ఆలోచించి, ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చి – 'ఏమైనా సరే ఈ సారి తిరిగి రాకూడదు!' అని తీర్మానించుకుని, 'ధైర్యే సాహసే లక్ష్మి' అనుకుని మర్నాడు మద్రాసు బండెక్కాడు. అది '57లో, ఏమైతే అదే ఆవుతుందని, ప్రయత్నాలు చెయ్యడం మొదలు పెట్టడంతో, అప్పుడూ అప్పుడూ వేషాలు వచ్చాయి. సారంగధర, భూలోకరంభ, తెనాలి రామకృష్ణ మొదలైన చిత్రాల్లో సుబ్బారావు చిన్న చిన్న పాత్రలో కనిపించాడు.

ఐతే జీవితం చాలా గడ్డుగా వుంది. రోజు గడవడానికి సంవత్సరం పడుతోంది. తను తెచ్చుకున్న, తెప్పించుకుంటున్న డబ్బు ఐపోతోంది. తన ప్రయత్నాలు సరిగా ఫలించడం లేదు. ఆశలు బాగానే కనిపిస్తున్నా అవి మాత్రం దిగంతాల అవతల ఉన్న నక్షత్రాల్లా అతి దూరంలో వున్నాయి. అలా అలా మూడు సంవత్సరాలు గడిచాయి. ఈ మూడేళ్ళ జీవితం సుబ్బారావుకు ముప్పై ఏళ్ళ పాఠాలు చెప్పింది. తిండి లేనప్పుడు, నీళ్ళు తాగి పడుకోమంది; వేషం ఇవ్వలేకపోయిన నిర్మాతని చూసినపుడు, క్రుంగి పోవద్దంది. నడవలేక తిరగలేక అలిసిపోయినపుడు, డీలా పడిపోయి నిస్సారం అయిపోకూడదంది.

ఈ వేషాల కోసం ఇహ అవస్థలు పడలేక సుబ్బారావు ప్రొడక్షన్ లైన్ లో కాలు పెట్టాడు. యన్.యస్.మూర్తి, యమ్.యస్.నాయక్ లు 'రామాంజనేయ యుద్ధం' తీస్తున్నారు. ఆ చిత్రానికీ 'సతీసుకన్య' చిత్రానికీ సుబ్బారావు నిర్మాణ శాఖలో పని చేసి అనుభవం సంపాయించాడు. అంతకు ముందు అతనికి ఆ అనుభవం లేక పోయినా, చేరి పని చెయ్యడంతో – చాలా విషయాలు తెలిశాయి. తనకు తానే చాలా వ్యవహారాలు తెలుసుకుని, అనుభవజ్ఞుడిలాగా పని చేసుకుంటూ పోయేవాడు.

ఐతే, అప్పటికీ విధి సుబ్బారావును ఒక చోట శాశ్వతంగా కుదర్చలేదు. ఇంకా ఆట ఆడించాలనుకుంది; ఇంకా పరీక్షించాలనుకుంది. ఆ చిత్రాలు పూర్తయిపోయిన తర్వాత మరో సంవత్సరం పాటు సుబ్బారావు మళ్ళీ ఖాళీ !

ఈ సంవత్సరంలో ఆయన పడని కష్టం అంటూ లేదు. ఏం చెయ్యాలి ? ఎలా బతకాలి ? మళ్ళీ వెనక్కి వెళ్ళి అక్కడ చేసేదేమీ లేదు. ఇక్కడే వుండి ఏదైనా చెయ్యాలంటే, ఎందులోనూ అవకాశాలు రావడం లేదు. రోజులు తిండికీ, నిద్రకీ కరువై పోతున్నాయి.

ఈ పరిస్థితిలో కొట్టుకు పోతూ వుండగా, చిన్న 'తెప్ప' లాంటిది దొరికింది. పాత ఫిల్ము కొని, అమ్మితే లాభం వస్తుందని చూశాడు. తనకు ఒక కంపెనీ నుంచి, రావాల్సిన ముప్పై రూపాయల కోసం తిరిగి, ఆ డబ్బు పెట్టుబడి పెట్టి, పాత ఫిల్ము కొని, తెల్లారే సరికే కాస్త లాభానికి అమ్మాడు. ఆ డబ్బుతో మళ్ళీ కొంత కొని; మళ్ళీ అమ్మాడు. ఆ వ్యాపారం బాగానే కనిపించింది; ప్రోత్సాహకరంగా వుంది. అంతే; ఆ వ్యాపారంలో తొందరగా చెయ్యి తిరిగింది;

రాణించారు; లాభాలు సంపాయించారు. అటు తర్వాత, ఆయనకు నటించాలన్న తాపత్రయం తగ్గిపోయింది. సినిమాల్లోనే వుంటూ, వ్యాపారం చేసుకోవచ్చునన్న నమ్మకం గట్టిగా కుదిరింది.

నిదానంగా ఒక తమిళ చిత్రాన్ని కొని, 'రాజ ద్రోహి' పేరిట డబ్ చేసి, విడుదల చేశారు. అది తొలి యత్నం. అయితే, ఈ లోగా, మరికొన్ని వ్యాపార రహస్యాలు తెలిసి, పాత చిత్రాలు కొనడం, అమ్మడం వంటివి కూడా చేస్తూ వచ్చారు.

'రాజద్రోహి' తర్వాత, స్ట్రైయిట్ చిత్రం తియ్యాలని, 'నానళ్' అన్న తమిళ చిత్రం కొని, 'హంతకులొస్తున్నారు జాగ్రత్త' అన్న పేరిట చిత్రంగా తీశారు.

ఆ రెండు చిత్రాలూ సుబ్బారావుకు లాభాలు తెచ్చి పెట్టకపోయినా, తాను కొన్న పాత చిత్రాల మీద కొద్దో గొప్పో వస్తున్న లాభాలతో నిరాశపడకుండా మళ్ళీ మరో చిత్రం తీశారు 'రణభేరి'.

"తొలినుంచీ నాకు నా వ్యాపారంలో భాగ స్వాములు అంటూ లేరు. నేనొక్కడినే, అప్పట్నించీ సొంతంగానే చిత్రాలు తీస్తున్నాను." అని చెప్పారు సుబ్బారావు.

'రణభేరి' తర్వాత పేదరాశి పెద్దమ్మ కథ, లక్ష్మీ కటాక్షం (యన్.టి.రామారావుతో) విక్రమార్క విజయం, సుగుణ సుందరి కథ, రౌడీలకు రౌడీలు, పిల్లా పిడుగా, రాణీ అవుర్ జానీ (హిందీ) మాయా మచ్ఛీంద్ర (యన్.టి.ఆర్ తో) సీతా కళ్యాణం (బాపు దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం విశేషమైన ప్రశంసలు పొందిన చిత్రం) సీతారామ వనవాసం, అడవిమనుషులు, లక్ష్మీ పూజ మొదలైన చిత్రాలు తీశారు. ఇటీవలే 'మహాశక్తి' విడుదల చేశారు. 'త్రిలోక సుందరి' విడుదలకు సిద్దంగా వుంది. 'రాహువు–కేతువు' (సాంఘిక చిత్రం) పూర్తయి పోయింది.

ఆర్థికంగా ఎలాంటి ఫలితం ఇచ్చినా సరే, చిత్రం మీద చిత్రం తియ్యడం అన్నది అరుదైన విషయం. ఆ అరుదైన విషయాన్ని సాధిస్తున్నారు గనుకనే, పింజల సుబ్బారావు దక్షత గల నిర్మాతగా నిలబడ్డారు; ప్రముఖ నిర్మాతగా పరిగణింప బడుతున్నారు.

"ఇన్ని చిత్రాలు తీశాను. ఏదీ కక్కుర్తి గానో, ఏదో రకంగానో తియ్యలేదు. ఆయా దర్శకుల మాట మేరకు, వారు కోరిన సదుపాయాలు సమకూరుస్తూ అన్ని చిత్రాలూ శ్రద్ధతోనే తీశాను. అయితే, నన్ను బాధించే విషయం ఏమిటంటే. ఏ చిత్రం కూడా వంద రోజులు, నడవలేదనే ! అదే నా దురదృష్టం" అంటారాయన.

"ఇన్ని సినిమాలు ఇలా వరసగా, తియ్యగలుగుతున్నానంటే, అదంతా నా ఘనత అని నేను అనుకోను. కేవలం నేను పరిశ్రమలో సంపాయించుకున్న మంచితనమే నా చేత ఇలా వరసగా చిత్రాలు తీయిస్తోందనుకుంటాను."

ఐతే ఆయన తీసిన చిత్రాలన్నీ పి.యస్.ఆర్. పిక్చర్స్ పేరు మీదనే రాలేదు. కొన్ని తన పేరు మీద తీస్తే మరికొన్నింటిని ఆయన తన పిల్లల పేర్ల మీద పి.యన్.ఆర్, ఆనంద లక్ష్మి , బాలాజీ అని తీశారు; తీస్తున్నారు.

పింజల సుబ్బారావు గారికి డిస్ట్రిబ్యూషన్ శాఖలో కూడా అనుభవం వుంది. పి.యస్.ఆర్ పిక్చర్స్ పేరిట హైద్రాబాద్ లో డిస్ట్రిబ్యూషన్ సంస్థ నడుస్తున్నది. కొంతకాలం కళ్యాణి పిక్చర్స్ లో భాగస్వామిగా కూడా వుండేవారు.

సినిమాల్లో అవకాశాలు ఎలా 'అదృష్టం' మీద కూడా ఆధారపడి వుంటాయో.. సినిమాల విజయం కూడా అదృష్టం మీదనే ఆధారపడి వుంటుందని సుబ్బారావు గట్టిగా నమ్ముతారు. "అందుకనే, ఎన్ని చిత్రాలు ఎంతటి భారీ తారాగణంతో వస్తున్నా కొన్ని విజయవంతం కావడం; కొన్ని కాకపోవడం" అంటారాయన.

విధి చేతిలో మనిషి మరబొమ్మ. అది తిప్పినట్టుగానే మనిషి తిరుగుతాడు. విధి సుబ్బారావునూ అలాగే తిప్పి తిప్పి, చివరికి ఒక ప్రముఖ నిర్మాతగా నిలబెట్టింది. త్వరలోనే 'వంద రోజుల' చిత్రాన్నీ తీయిస్తుంది. ఆ పట్టుదలా, దీక్షా సుబ్బారావులో వున్నాయి గనక, ఆ రెండూ కలిసి విధినే తమ చేతుల్లో తిప్పుకుంటాయి. అందుకు సందేహం లేదు !

★★★

COMMENTS